సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం । 12 । జనవరి । 2024



మేలుకొలుపు విని..

ధనుర్మాసంలో మేలుకొలుపులు వినిపిస్తున్నాయి. భజన బృందాలు వేకువనే తిరుగుతున్నాయి.
- 8లో



సంబరాల సంక్రాంతి

సంక్రాంతి సందళ్లు కనిపిస్తున్నాయి. బజార్లు కళకళలాడుతున్నాయి.
- 8లో

'శ్రామిక్ యూనియన్ నిరసన'

కాశీబుగ్గ: తమకు ఎన్‌పీఎస్ వద్దని ఓపీఎస్ కావాలని పలాస రైల్వేస్టేషన్ ఎదురుగా ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ పలాస బ్రాంచ్ కార్మిక సంఘ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్మికులు వారి డిమాండ్లు నెరవేర్చేవరకు పోరాటం కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ జాయింట్ సెక్రటరీ ఎం.రామకృష్ణ, బ్రాంచ్ ప్రెసిడెంట్ పీటీవీఎస్ రావు, బ్రాంచ్ సెక్రటరీ ఎం.ఉమామహేశ్వరరావు, యూత్ కోఆర్డినేటర్ జే ప్రవీణ్, లక్ష్మీనారాయణరెడ్డి, హరికృష్ణ, రామకృష్ణ, నాగేశ్వరరావు, కుమార్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

జాతీయ మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో కాంస్యం



సాధించిన పతకం, ట్రోఫీతో ముంత గాయత్రి

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంచలనం ముంత గాయత్రి చరిత్ర లిఖించింది. శ్రీకాకుళం జిల్లా నుంచి జాతీయ సీనియర్స్ మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పతకం సాధించిన మొట్టమొదటి క్రీడాకారిణిగా గుర్తింపు పొందింది. మహారాష్ట్రలోని గడ్చిరోలి వేదికగా ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు 69వ ఆలిండియా సీనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ మహిళల జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. దీంతో ఆంధ్రప్రదేశ్ మహిళల జట్టుకు ప్రాతినిధ్యం వహించిన గాయత్రి కాంస్య పతకంతోపాటు ప్రశంసా పత్రాన్ని అందుకుంది. ముంత గాయత్రి స్వగ్రామం ఎచ్చెర్ల. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతోంది.

వైజాగే రాజధాని కావాలి



ప్రారంభోత్సవంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు, ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం రూరల్: 'మన తాతలు రాజధానికి మద్రాసు వెళ్లారు. మన తండ్రులు కర్నూలు వెళ్లారు. మనం హైదరాబాద్ వెళ్లాం. ఇప్పటికైనా వైజాగ్‌ను రాజధానిగా చేయాలి. వైజాగ్ గురించి అసెంబ్లీలో ప్రస్తావించినప్పుడు సీఎం వైఎస్ జగన్ కూడా ఆమోదం తెలిపారు.' అని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఆయన మండల పరిధిలోని కిష్టప్పపేట గ్రామంలో రూ.66.22 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, ప్రహరీలను ప్రారంభించారు. స్థానికంగా ఎంపీపీ నిధులతో బస్ షెల్టర్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధాని విషయంలో తాము ఒకే మాట మీద ఉన్నామని తెలిపారు. టీడీపీ నాయకులు రాజధాని పేరిట భూములు కొట్టేశారని విమర్శించారు. 2019 ముందు ఎన్నికల సమయంలో చెప్పిన వాగ్దానాలన్నీ పూర్తి చేశామన్నారు. చరిత్రలో వైఎస్సార్ సీపీ ఒక్కటే ఇచ్చిన మేనిఫెస్టోలో అన్ని పనుల చేసి చూపించిందని అన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించామన్నారు. పార్టీ యువ నేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే పట్టం కట్టాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న ధర్మానను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీను, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, ఎంపీపీ అంబటి నిర్మల, ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, మండల పార్టీ అధ్యక్షుడు చిట్టి జనార్దన రావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గొండు కృష్ణ, మండల పార్టీ ఉపాధ్యక్షుడు బాణ నర్సింగరావు, జిల్లా పార్టీ యువజన విభాగం కార్యదర్శి గుండ హరీష్, పార్టీ నాయకులు అల్లు లక్ష్మీనారాయణ, గుండ మోహన్, గంగు నరేంద్రకుమార్, చిట్టి రవికుమార్, గుండ ఢిల్లీరావు, బాణ శ్రీను, చల్లా గోవింద, భగవాన్ దాస్, బాణ తిరుపతిరావు, బగ్గు అప్పారావు, నక్క శంకర్, యజ్జల గురుమూర్తి, బలగ గణపతి పట్నాయక్, రుప్ప అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.


22న ఓటర్ల తుది జాబితా విడుదల

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాజకీయ పార్టీలు అందించే వినతులు, ఫిర్యాదుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, జనవరి 22న ఓటర్ల తుది జాబితా విడుదల చేయనున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 28వ వారపు సమావేశాన్ని నిర్వహించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల కోసం పూర్తి స్థాయి ఓటర్ల తుది జాబితాను జనవరి 22న విడుదల చేస్తామని, ఫారం 6, 7, 8 లకు సంబంధించిన తుది పరిశీలన పూర్తయిందని చెప్పారు. డిసెంబర్9 తర్వాత వచ్చిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకుంటున్నామని తెలిపారు. బీఎల్ఓ స్థాయిలోనూ దరఖాస్తులు పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. క్యాండిడేట్ హ్యాండ్ బుక్ ఈసీఐ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందన్నారు. ఈ నెల 12వ తేదీ నాటికి అన్ని అన్ని స్థాయిల్లో క్లెయిములకు పరిష్కారం లభిస్తుందన్నారు. సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎం.గణపతి రావు, రౌతు శంకరరావు (వైఎస్సార్‌సీపీ), పీఎంజే బాబు(టీడీపీ), ఎల్.సోమేశ్వరరావు (బీఎస్పీ), పసుపులేటి సురేష్ బాబు సింగ్ (బీజేపీ), సి సెక్షన్ సూపరింటెండెంట్ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

అద్భుతం

ఇది మా స్కూలేనా..!

'మా రోజుల్లో బ్లాక్‌బోర్డులు ఉండేవి.. ఇప్పుడు వీరికి ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ ఉన్నాయి. మాకు టాయిలెట్స్ కూడా సరిగా లేవు. ఇప్పుడున్న వారికి అన్ని సదుపాయాలు ఏర్పాటయ్యాయి. మేమున్నప్పుడు గచ్చులైతే పాడైపోయి ఉండేవి. ఈ స్టూడెంట్లకు గ్రానైట్ పలకలతో ఫ్లోర్ వేశారు. ఆర్ఓ ప్లాంట్, కిచెన్ రూమ్, సైన్స్ ల్యాబ్.. ఇన్ని ఉన్నాయా ఇక్కడ..? ఇదసలు మన స్కూలేనా..' జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన పాత విద్యార్థుల అభిప్రాయమిది. రెండు రోజుల పాటు తాము చదువుకున్న బడిని చూసిన మాజీ విద్యార్థులు ఇక్కడ జరిగిన మార్పులు గమనించి అబ్బురపడ్డారు. ప్రభుత్వం చేస్తున్న కృషిని మనసారా మెచ్చుకున్నారు.





నాడు-నేడు పనులను పరిశీలించేందుకు వచ్చిన పూర్వ విద్యార్థులతో డిప్యూటీ ఈవో విజయకుమారి, ఉపాధ్యాయులు



సైన్స్ ల్యాబ్‌లో సదుపాయాలను చూస్తున్న పూర్వ విద్యార్థులు దుప్పల రవీంద్ర, తదితరులు

- తమ పాఠశాలను చూసి అబ్బురపడిన శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు
- నాడు-నేడు పనులు చూసి ముచ్చటపడిన వైనం
- ప్రభుత్వ కృషిని మనసారా మెచ్చుకున్న ఓల్డ్ స్టూడెంట్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను బుధ, గురువారాల్లో పూర్వ విద్యార్థులు పరిశీలించారు. తాము చదువుకున్న రోజుల్లో పాఠశాలను, ప్రస్తుత తరగతి గదులను పోల్చి చూసి ఆశ్చర్యపోయారు. డిజిటల్ తరగతులు చూసి చాలా మంది అబ్బురపడిపోయారు. తరగతుల్లో నల్లబల్ల స్థానంలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ (ఐఎఫ్‌పీ)లను అమర్చి ఉండటాన్ని చూసి మంత్రముగ్ధులయ్యారు. సైన్స్ ల్యాబులు, గ్రానైట్ ఫ్లోరింగ్, టాయిలెట్లు చూసి ఆనందించారు. వీటిలో కొన్ని సౌకర్యాలు పూర్వ విద్యార్థులు సమకూర్చినట్టు హెచ్‌ఎం చెప్పారు. ఇదే పాఠశాలలో చదువుకున్న నటుకుల మోహన్, దుప్పల రవీంద్ర, బొత్స వెంకటరావు, ప్రకాష్‌బాబు బుక్స్టాల్ శివ, మ్యాథ్స్ అసిస్టెంట్ గుప్తా, వివిధ బ్యాచ్‌లుగా వచ్చి పాఠశాలలో జరిగిన నాడు-నేడు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు గోవిందరావు, రవికుమార్, తేజేశ్వరరావు, మల్లేశ్వరరావు, ఖగేశ్వరరావు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డీఈఓ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం బడులకు కొత్త శోభను తీసుకువచ్చిందని తెలిపారు. ఇందులో భాగంగానే మనబడి నాడు-నేడు పేరిట ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి తీసుకెళ్లాలనే సంకల్పంతో సరికొత్త సంస్కరణకు నాంది పలికారని తెలిపారు.

రూ.1.16 కోట్ల నిధులతో..

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫేజ్-2లో రూ. కోటి 16 లక్షల నిధులతో అదనపు తరగతుల భవన నిర్మాణాన్ని పూర్తిచేశారు. 10 తరగతి గదులతో నిర్మించిన భవనంలో అనేక వసతులు, సౌకర్యాలతో సుందరంగా తీర్చిదిద్దినట్టు ఆ పాఠశాల హెచ్‌ఎం, శ్రీకాకుళం ఉప విద్యాశాఖాధికారి ఎం.విజయకుమారి పేర్కొన్నారు.

సీఎం ఆలోచన చాలా గొప్పది..



ఈ స్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుకుని 1985 రిలీవ్ అయ్యాను. 30 సంవత్సరాల కింద మేము చదువుకున్న పరిస్థితులు వేరు. ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. ఒక పాఠశాలకు కావాల్సిన అన్ని వసతులు, సౌకర్యాలను ప్రభుత్వం సమకూర్చుతోంది. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నారు. సీఎం జగన్ ఆలోచన, దూరదృష్టి చాలా గొప్పదని చెప్పక తప్పదు.

– దుప్పల రవీంద్ర, పూర్వ విద్యార్థి, వ్యాపారవేత్త

ప్రభుత్వం విద్యకు పెద్దపీట



ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యకు పెద్దపీట వేస్తోంది. అమ్మఒడి మొదలుకుని విద్యాకానుక, గోరుముద్ద, సీబీఎస్సీ సిలబస్, ఇంగ్లీషు మీడియం, మిర్రర్ ఇమేజ్ పాఠ్యపుస్తకాలు ఇలా ఎన్నో పథకాలు, కార్యక్రమాలు తీసుకువచ్చారు. నాడు-నేడుతో పాఠశాలలను సమూలంగా మార్చారు. అన్ని వసతులు, సౌకర్యాలను అందుబాటులో ఉంచారు. పాఠశాలలో రూ.1.16 కోట్ల నిధులతో 10 అదనపు తరగతులతో కూడిన భవనాన్ని నిర్మించారు.

– ఆర్.విజయకుమారి, హెచ్‌ఎం/ శ్రీకాకుళం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి

నాడు-నేడు పేరుకు తగ్గట్టుగానే ఉంది..



నేను ఇదే పాఠశాలలో 1970 నుంచి 1980 వరకు ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుకున్నాను. అప్పటికీ ఇప్పటికీ ఎంతో తేడా ఉందని అనే కంటే.. వంద శాతం తేడా ఉందనే చెప్పాలి. మాకు బ్లాక్‌బోర్డు ఉండేది. టాయ్‌లెట్స్ ఉండేవి కావు. తాగునీరు ఉండేది కాదు. ఇంటి నుంచి ఎవరి భోజనం వారే తెచ్చుకునేవారం. ఉపాధ్యాయుల కొరత ఉండేది. కానీ ప్రస్తుత ప్రభుత్వం నాడు-నేడు పేరుతో అన్ని వసతులు, సౌకర్యాలు కల్పించింది. డిజిటల్ విద్య పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంది. సీఎం విజన్‌కు హ్యాట్సాఫ్.

– నటుకుల మోహన్, పూర్వ విద్యార్థి

బీసీలకు జై



- మరోసారి బీసీ వర్గానికి ప్రాధాన్యత కల్పించిన వైఎస్సార్‌సీపీ
- పలు నియోజకవర్గాలకు కొత్త ఇన్‌చార్జిల నియామకం
- పార్లమెంట్ ఇన్‌చార్జిగా కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్
- ఇచ్ఛాపురం ఇన్‌చార్జిగా జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ
- ఆమె స్థానంలో ఇచ్ఛాపురం జెడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మకు ప్రమోషన్
- టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: వెనుకబడిన వర్గాలకు వైఎస్సార్ సీపీ మరోసారి రాజకీయ ప్రాధాన్యత కల్పించింది. విధేయతను గుర్తిస్తూ.. పార్టీ కోసం తొలి నుంచి పనిచేస్తున్న నేతలను గౌరవించింది. రానున్న ఎన్నికల దృష్ట్యా పలు నియోజకవర్గాలకు కొత్త ఇన్‌చార్జిలను నియమించింది. పార్లమెంట్ ఇన్‌చార్జిగా రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్‌ను నియమించగా, ఇచ్ఛాపురం అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జిగా ప్రస్తుత జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయను, టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జిగా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను నియమించింది. ప్రస్తుత జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయను, అసెంబ్లీ ఇన్‌చార్జిగా నియమించడంతో ఆమె స్థానంలో ఇచ్ఛాపురం జెడ్పీటీసీగా పనిచేస్తున్న ఉప్పాడ నారాయణమ్మను నియమించారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది.

పేరాడ్ తిలక్‌కు రాజకీయ ప్రమోషన్



రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేస్తున్న పేరాడ తిలక్ సేవలను అధిష్ఠానం గుర్తించింది. బీసీ వర్గాలకు చెందిన తిలక్ పార్టీ కోసం అహర్నిశలు పనిచేస్తున్నారు. యువకుడు, పట్టభద్రుడైన పేరాడ తిలక్‌ను పార్లమెంట్ ఇన్‌చార్జిగా పార్టీ అధిష్ఠానం నియమించింది. గత ఎన్నికల్లో ఆయన టెక్కలి అసెంబ్లీకి పోటీ చేశారు. ఆ తర్వాత కార్పొరేషన్ పదవిని అధిష్ఠానం అందించింది. ఇప్పుడు ఏకంగా పార్లమెంట్ ఇన్‌చార్జిగా నియమించింది. ఇప్పుడు ఆ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

విజయకు కొత్త అవకాశం



తొలిసారిగా జెడ్పీటీసీగా గెలిచి, ఆ వెంటనే జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా నియమితులై జిల్లా స్థాయిలో గుర్తింపు పొందిన పిరియా విజయకు మరో రాజకీయ ప్రాధాన్యత కల్పించింది. మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ సతీమణిగా రాజకీయాల్లో ప్రవేశించి, అంచలంచెలుగా ఎదిగి, ప్రజల ఆదరాభిమానాలు పొందుతున్న పిరియా విజయకు ఇచ్ఛాపురం నియోజకవర్గం ఇన్‌చార్జిగా నియమిస్తూ ప్రత్యేక గుర్తింపునిచ్చింది.

ఎమ్మెల్సీ దువ్వాడకు టెక్కలి బాధ్యతలు



గత ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసి స్వల్ప ఓట్లతో ఓటమి పాలైన దువ్వాడ శ్రీనివాస్‌కు అధిష్ఠానం అండగా నిలిచింది. పార్టీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్సీ పదవిని కేటాయించిన అధిష్ఠానం ఇప్పుడు టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించింది. పోస్టు గ్రాడ్యుయేషన్ చేసిన దువ్వాడ శ్రీనివాస్‌కు రాజకీయంగా ప్రత్యేక గుర్తింపు ఇచ్చింది. పార్టీకి తొలి నుంచి సేవలందిస్తూ విధేయతను కూడా చాటుకున్నారు. ఈ రెండు అంశాలు ఆయనకు రాజకీయంగా ప్రాధాన్యతను తెచ్చి పెట్టాయి.

జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఉప్పాడ నారాయణమ్మ



ఇచ్ఛాపురం జెడ్పీటీసీగా పనిచేస్తున్న రెడ్డిక సామాజిక వర్గానికి చెందిన ఉప్పాడ నారాయ ణమ్మను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవి వరించింది. ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలను పిరియా విజయకు అప్పగించడంతో ఆమె స్థానంలో ఉప్పాడ నారాయణమ్మను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో తొలి ప్రయత్నంలోనే ఆమెకు ప్రమోషన్ లభించి, అత్యున్నత పదవి దక్కినట్టు అవుతోంది. ఆమె కుటుంబానికి రాజకీయ అనుభవం ఉంది.

చిరువ్యాపారులకు 'తోడు'గా..

- జగనన్న తోడు కింద జిల్లాలో 17,600 మందికి రూ.18.62 కోట్లు
- రుణాలు తీసుకున్న 24,740 మందికి రూ. 52.18 లక్షలు వడ్డీ జమ



నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎమ్మెల్యే రెడ్డి శాంతి తదితరులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: చిరు వ్యాపారులకు భరోసానిస్తూ ప్రభుత్వం గురువారం జగనన్న తోడు ఎనిమిదో విడత నగదు విడుదల చేసింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వర్చువల్‌గా కార్యక్రమం నిర్వహించగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ జగనన్న తోడు 2022-23 ఆర్థిక సంవత్సరం ఫేస్-8 రుణాల పంపిణీ, లబ్ధిదారులకు వడ్డీ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని చెప్పారు. జిల్లాలో 17,600 మంది లబ్ధిదారులకు రూ.18.62 కోట్లు, అలాగే ఇదివరకు రుణాలు తీసుకున్న 24,740 మంది లబ్ధిదారులకు రూ. 52.18 లక్షలు వడ్డీ జమ చేయనున్నట్లు తెలిపారు. సకాలంలో చెల్లించిన వారికి ఏటా మరో రూ.1,000 చొప్పున జోడిస్తూ రూ.13,000 వరకూ వడ్డీలేని రుణాన్ని అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం లబ్ధిదారులకు నమూనా చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, ఎల్‌డీఎం ఎం.సూర్య కిరణ్, మెప్మా పీడీ కిరణ్ కుమార్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీలు విధుల్లో చేరాల్సిందే'

శ్రీకాకుళం క్రైమ్ : అంగన్‌వాడీలు విధుల్లో చేరాల్సిందేనని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖాధికారి బి.శాంతిశ్రీ అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల డిమాండ్లపై పూర్తి సానుకూలంగా ఉందని, ఇప్పటికే జిల్లాలోని 1444 మంది విధుల్లో చేరారని తెలిపారు. ఇంకా చేరని అంగన్‌వాడీ వర్కర్లకు షోకాజ్ నోటీసులు పంపించామని, అప్పటికే చేరకపోతే ప్రభుత్వం కొద్ది రోజుల్లో తీసుకునే కఠిన చర్యలకు సిద్ధంగా ఉండాలన్నారు. విధుల్లో చేరిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు కలిపి అత్యధికంగా గారలో 268, పాతపట్నంలో 250, శ్రీకాకుళంలో 199 మంది ఉన్నారని తెలిపారు.

జానపదం ఝల్లుమన్నది..



లింగిడిలింగిడి మల్లేశ్వరరావు నృత్యం

మహిళలతో మంత్రి సీదిరి అప్పలరాజు సెల్ఫీ

పలాస: సిక్కోలు జానపదం పోరాటాలకు ఒక జ్ఞానపథమని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస మండలం గురుదాసుపురంలో గ్రామంలో గురువారం సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో ఘనంగా జానపద కళాజాతర జరిగింది. ఉదయం 8గంటలకే వేదికపై కళాకారులు అమ్మవారి నృత్యాలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మంత్రి డాక్టరు సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ఏటా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి ప్రపంచానికి తెలియజేయడం చాలా సంతోషకరమని అన్నారు. సిక్కోలు జాన సాహిత్య కళావేదికకు ఒక స్థలం, ఆడిటోరియం అవసరం ఉందని, అందుకు తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం తెలుగుదేశం పార్టీ నాయకురాలు గౌతు శిరీష మాట్లాడుతూ జానపద కళలను పరిరక్షించాలని, అందుకు సిక్కోలు జాన పద సాహిత్య కళావేదిక చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఆ తర్వాత తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రముఖ కళాకారుడు ఏపూరి సోమన్న తన ఆటా పాటలతో ఎంతో ఉత్తేజాన్నిచ్చారు. కార్యక్రమంలో సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక అధ్యక్షుడు రాపాక ధనరాజు, వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లేన దేవరాజు, ప్రచార కార్యదర్శి కుత్తుం వినోద్, డాక్టరు కుమార్‌నాయక్, కళాకారులు దాసరి తాతారావు, గేదెల తులసి, వివిధ గ్రామాల నుంచి వచ్చిన కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.



చెంచుల బృందం ప్రదర్శన



గంగిరెద్దులతో ఆటలు

క్లుప్తంగా

ప్రైవేట్ పాఠశాలకు తాళాలు

టెక్కలి: సంక్రాంతి సెలవుల నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘిస్తూ టెక్కలిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో గురువారం తరగతులు నిర్వహిస్తుండడంతో, తమకు అందిన సమాచారం మేరకు విద్యా శాఖాధికారులు ఆ పాఠశాల వద్దకు చేరుకుని బడికి తాళాలు వేశారు. పాఠశాల తలుపులు మూసి లోపల తరగతులు నిర్వహిస్తున్న విషయాన్ని ఏబీవీపీ విద్యార్థి సంఘం ప్రతినిధులు మురళి, మదన్, అరవింద్, శ్యామ్ తదితరులు తెలుసుకుని తక్షణమే మండల విద్యా శాఖాధికారులు తులసీరెడ్డి, చిన్నారావు తదితరులకు సమాచారం అందజేశారు. దీంతో అధికారులు పాఠశాల వద్దకు చేరుకుని కరస్పాండెంట్ శ్రీనివాసరావుపై మండిపడ్డారు. అనంతరం పాఠశాలకు తాళాలు వేశారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో డ్రైవర్‌కు గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని బాటలింగ్ యూనిట్ మద్యం గోదాం వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో షాక్ తగిలి లారీ డ్రైవర్, యజుమాని రవి గాయపడ్డారు. మద్యం అన్‌లోడ్ చేసే క్రమంలో పైనున్న విద్యుత్ లైన్లకు తాకటంతో ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ అయ్యింది. దీంతో షాక్ కొట్టి ఆయన కింద పడిపోయారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడి నుంచి వైజాగ్ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

జిల్లా కవులకు ఏలూరులో సత్కారం



జిల్లాకు చెందిన కవులను సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఏలూరులో జరిగిన సాహిత్య సంక్రాంతి సంబరాల సందర్భంగా జిల్లాకు చెందిన పలువురు కవులను సత్కరించారు. జిల్లా ప్రభుత్వ యంత్రాంగం సౌజన్యంతో శ్రీశ్రీ కళావేదిక అధినేత కత్తిమండ ప్రతాప్ సమక్షంలో శ్రీకాకుళం జిల్లా నుంచి వచ్చిన మహ్మద్ రఫీ, జంధ్యాల శరత్‌బాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమారరాజు, బి.కోటేశ్వరరావు, పీవీ దుర్గాప్రసాద్, చాడ శ్రీనివాస్‌లను ఘనంగా సత్కరించారు.

'ఆరోగ్యం శ్రద్ధగా కాపాడుకోవాలి'



అప్పారావు దంపతులకు జ్ఞాపికను అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: విధి నిర్వహణలో అలుపన్నది లేకుండా శారీరక శ్రమనోర్చి బాధ్యతలు నిర్వర్తించారని, పదవీ విరమణ తర్వాతైనా ఆరోగ్యం శ్రద్ధగా కాపాడుకోవాలని ఎస్పీ జి.ఆర్.రాధిక హోంగార్డు కొవ్వూరు అప్పారావుకు సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు అప్పారావు దంపతులకు గురువారం ఆమె సత్కారం చేశారు. తక్షణ ఆర్థిక సాయం కింద రూ. 5 వేలు నగదును అందజేసి విధి నిర్వహణలో అప్పారావు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ జె.తిప్పేస్వామి, డీఎస్పీలు వై.శృతి, నాగేశ్వరరెడ్డి, ఆర్ఐ కె.నర్సింగ మూర్తి, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శ్రీరితిక



నియామక పత్రం అందిస్తున్న రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య


శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కూన సరస్వతి (రితిక)ను నియమిస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య నియామకం పత్రం అందించారు. ఈ మేరకు అమరావతిలో నియామక పత్రం గురువారం అందించారు. రాష్ట్రంలో ఉన్న బీసీ మహిళల్లో చైతన్యం తీసుకొని వచ్చి రాజ్యాధికారం దిశగా అడుగులు వేసేలా కార్యాచరణ చేయాలని కృష్ణయ్య సూచించారు. అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తానని సరస్వతి అన్నారు.

మద్యం మత్తులో యువకుల హల్‌చల్

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని సూర్యమహల్ కూడలిలో గురువారం రాత్రి మద్యం మత్తులో నలుగురు యువకులు హల్‌చల్ చేశారు. కారులో షికారు చేస్తూ వచ్చే పోయే ప్రజలకు అసౌకర్యం కలిగిస్తుండటంతో ట్రాఫిక్ ఎస్ఐ ఎస్ఎస్ దొరకు అనుమానం వచ్చి తమ సిబ్బందితో కలిసి కారును సూర్యమహల్ కూడలి వద్ద ఆపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష చేద్దామని ప్రయత్నించగా యువకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఆ ప్రాంతంలో కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఎంతకీ యువకులు టెస్టుకు సహకరించకపోవడంతో కారును ట్రాఫిక్ పీఎస్‌కు తరలించినట్లు ఎస్ఐ ఎస్ఎస్ దొర పేర్కొన్నారు.



బలగ మేలుకొలుపు బృందం



మేలుకొలుపు విని.. మీకు శుభమని

- భజనలతో భక్తి నివేదన
- నెల రోజుల పాటు ధనుర్మాస సేవలు

శ్రీకాకుళం కల్చరల్:

ఒకరు మౌనంగా కొలుస్తారు. మరొకరు మంత్రాలు చదువుతారు. ఇంకొకరు భక్తితో గీతాలాపన చేస్తారు. భగవంతుని స్మరణకు మానవాళి ఎంచుకున్న మార్గాలెన్నో. వాటిలో ఒకటి మేలుకొలుపు. ముఖ్యంగా ధనుర్మాసంలో నెల రోజుల పాటు నిర్వహించే ఈ మేలుకొలుపులు వేకువనే భక్తిభావాన్ని మేల్కొలుపుతాయి. జిల్లా వ్యాప్తంగా అనేక భజన బృందాలు ఎన్నో ఏళ్లుగా ఈ సంప్రదాయాన్ని ఆచరిస్తున్నాయి. శ్రీకాకుళం పట్టణంలోనే దాదాపు 15 వరకు భజన బృందాలు ఉన్నాయి. తమ గురువులు రాసిన పాటలను పాడుతూ ఏకాదశి వంటి పుణ్యకాలాల్లో భజనలూ చేస్తు తమ భక్తిని ప్రదర్శిస్తున్నారు. ధనుర్మాసం సందర్భంగా నెలరోజుల పాటు వీధులలో, గ్రామాల్లో తెల్లవారుజామునే కీర్తనలు ఆలపిస్తారు. వీరిలో కొన్ని భజన బృందాలు బియ్యం, వస్తువులు, డబ్బులు కూడా సేకరిస్తారు. వాటిని ఒక రోజున ఉచితంగా అన్నప్రసాద వితరణ, మిగిలిన దానితో సంబంధిత ఆలయ అభివృద్ధికి ఖర్చు చేస్తారు.



చలిలో పాతశ్రీకాకుళం వెంకటేశ్వర భజన మండలి



కొన్నావీధి భజన బృందం

50 ఏళ్లుగా బలగలో..

గత 50 ఏళ్లుగా బలగ హరేరామ మందిరం భక్త బృందం ధనుర్మాస మేలుకొలుపులు నిర్వహిస్తున్నారు. 1970లో ఈ భక్త బృందం ఒక ఆధ్యాత్మిక కుటీరాన్ని నిర్మించింది. వీరు సేకరించిన వస్తువులతో ఏటా రథసప్తమి నాడు అన్నదానం చేస్తారు. మిగిలిన సొమ్మును మందిరం అభివృద్ధి కోసం ఖర్చు చేస్తారు.

25 ఏళ్లుగా భీమేశ్వర భజన మండలి

పట్టణంలోని కొన్నావీధిలోగల భీమేశ్వరాలయం వద్ద ఏర్పాటైన శ్రీభీమేశ్వర భజన మండలి పాతికేళ్లుగా మేలుకొలుపులు పాడుతోంది. ప్రతిరోజూ ఉదయం ఈ సభ్యులు కొన్నావీధి భీమేశ్వరాలయానికి ఉదయం 5 గంటలకు చేరుకుంటారు. ధనుర్మాస సమయంలో నెల రోజులపాటు వీధుల్లో భజనలు చేస్తూ తిరుగుతారు. సేకరించిన బియ్యం, సొమ్మును సంక్రాంతి రోజున ఆలయం వద్ద ఏకాహం రోజున ఖర్చు చేస్తారు. మేలుకొలుపు ద్వారా సేకరించిన సొమ్ముతో పేదలకు వస్త్రదానం చేస్తారు.

అలాగే పాతశ్రీకాకుళంలోని కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయం కేంద్రంగా గత 12ఏళ్లుగా మేలు కొలుపు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. కొత్తూరు, మెళియాపుట్టి, పాతపట్నం వంటి చోట్ల కూడా మేలుకొలుపులు దశాబ్దాలుగా నిర్వహిస్తున్నారు.

దేవుని సేవతో మానవ సేవ

దేవుని సేవతోపాటుగా మానవ సేవ కూడా నిర్వహిస్తున్నాం. తెల్లవారు జామున పెద్దగా పాడుతూ తిరగడం వలన వ్యాయామం చేసినట్లే. 14 ఏళ్లుగా దీన్ని నిర్వహిస్తున్నాం. మాగురువు చవిటి పల్లి రాజారావు స్ఫూర్తితో ఈ భజన మండలి ఏర్పాటు చేశాం. 500 భజన పాటలు సినిమా సంగీత బాణీలో కూర్చి పాడుతుంటాం. ఎవరైనా చనిపోయినా కూడా భజన కోసం వెళుతుంటాం.

– బారికల రామారావు, అధ్యక్షులు, భజనమండలి

సంబరాల సంక్రాంతి



మందస: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భోగిమంటను వెలిగిస్తున్న ప్రిన్సిపాల్ చింతాడ శరత్‌బాబు

సంక్రాంతి సందడి అంతటా కనిపిస్తోంది. రైతులు ధాన్యలక్ష్మిని ఇంటికి తెచ్చే పనుల్లో బిజీగా ఉన్నారు. విద్యార్థులు బడులు, కాలేజీల్లో సంబరాలు నిర్వహిస్తున్నారు. కొత్త దుస్తుల కొనుగోళ్లతో మార్కెట్‌లు కళకళలాడుతున్నాయి.



కవిటి: ధాన్యలక్ష్మికి పూజలు నిర్వహిస్తున్న రైతులు



శ్రీకాకుళంలో జీటీ రోడ్డులో రద్దీ



శ్రీకాకుళంలోని ఓ షాపింగ్ మాల్‌లో కొనుగోలుదారుల సందడి

'లక్ష్య సాధన దిశగా అడుగులు వేయాలి'



ఎక్స్‌లెన్స్ అవార్డుల కార్యక్రమంలో మాట్లాడుతున్న దానేటి శ్రీధర్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): విద్యార్థులు పట్టుదలతో చదవాలని, లక్ష్య సాధన దిశగా అడుగులు వేయాలని ప్రముఖ గైనిక్ వైద్యనిపుణులు డాక్టర్ దానేటి శ్రీధర్ పిలునిచ్చారు. నగరంలోని బాపూజీ కళా మందిర్‌లో 102 మంది ప్రతిభ కలిగిన విద్యార్థులకు సిక్కోలు ఎక్స్‌లెన్స్ అవార్డులను గురువారం అందించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థుల చదువు ప్రాధాన్యతను గుర్తించాలని, 18 నుంచి 20 ఏళ్ల వయసులో మీరు ఎంచుకున్న రంగాల్లో ఉన్నతంగా రాణించేందుకు కృషి చేయాలని సూచించారు. ఎవరైతే ప్రణాళికాబద్ధంగా, సమయపాలన పాటిస్తూ ముందుకు సాగుతారో వారు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు, చెడు అలవాట్లకు, స్నేహితులకు దూరంగా ఉండాలని సూచించారు. అనవసరంగా ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడి తల్లిదండ్రులకు కడుపుకోత మిగల్చవద్దని కోరారు. విజయానికి దగ్గర దారులు ఉండవని, కఠోర శ్రమ ఒక్కటే ఉంటుందన్నారు. 102 మందికి రూ. 3.93లక్షలు అవార్డు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ గుంట తులసీరావు, డీఈఓ సుగుణాకర్, ప్రముఖ వ్యాపారవేత్త అంధవరపు ప్రసాద్, ప్రముఖ విద్యావేత్త జామి భీమశంకర్, సన్ డిగ్రీ కళాశాల డైరెక్టర్ జయరాం, గణపతి మాస్టారు, పైడి హరనాథ్, గుడ్ల దామోదర్, నటుకుల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- మరొకరి తీవ్ర గాయాలు



సవర ఉమాపతి (ఫైల్)



ప్రమాదానికి గురైన ద్విచక్రవాహనం, ఆటో

మందస: మండలంలోని కిల్లోయి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సవర ఉమాపతి(28) అనే యువకుడు మృతి చెందాడు. ఆడుకునేందుకు వెళ్లిన కుమారుడు ఇలా శవమై తిరిగి రావడంతో తల్లిదండ్రులు సవర చంద్రయ్య, సీతమ్మలు కన్నీరుమున్నీరయ్యారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని గిరిజన పంచాయతీ బొగాబందలో సియాలుట్టి గ్రామానికి చెందిన సవర ఉమాపతి(28), కొంకడాపుట్టి గ్రామానికి చెందిన కొయ్యాపు ఢిల్లేశ్వరరావు అనే మరో యువకునితో వీరగున్నమ్మపురంలో జరుగుతున్న ఆటల పోటీలకు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. మధ్యాహ్నం 12.30 గంటలకే పోటీలు ముగియగా.. తిరుగుముఖం పట్టారు. సాయంత్రం ఇంటికి చేరే సమయంలో కిల్లోయి శ్మశాన వాటిక వద్ద ఇదే మండలంలోని పొత్తంగికి చెందిన ఆటో.. ఉమాపతి ప్రయాణిస్తున్న బైక్ ఢీకొన్నాయి. ప్రమాదంలో ఉమాపతికి తీవ్ర గాయాలయ్యాయి. వెనుక ఉన్న ఢిల్లేశ్వరరావుకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. వీరిద్దరినీ పలాస సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఈలోగా పరిస్థితి విషమించడంతో ఉమాపతి మరణించాడు.

ఢిల్లేశ్వరరావుకు చేయి విరిగిపోవడంతో హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మృతునికి సోదరుడు పూర్ణారావు ఉన్నాడు. సంఘటనా స్థలానికి సమీపంలోనే ఉమాపతి ఇల్లు ఉండడంతో తల్లిదండ్రులు, బంధువులు సంఘటన స్థలానికి చేరుకుని రోదించారు. ఉమాపతి మృతితో సియాలుట్టిలో విషాదచాయలు అలముకున్నాయి. మందస ఎస్ఐ బి.అనిల్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

'కన్యాకుమారి' టీజర్ విడుదల



కన్యాకుమారి టీజర్ పోస్టర్

నరసన్నపేట: జిల్లాలో చిత్రీకరణ జరుపుకున్న 'కన్యాకుమారి' సినిమా టీజర్ విడుదల చేసినట్లు చిత్ర దర్శకుడు అట్టాడ సృజన్ కుమార్ తెలిపారు. ఈ టీజర్‌ను సినీ హీరో విజయ దేవర కొండ విడుదల చేశారని యూట్యూబ్‌లో వైరల్ అవుతోందని దర్శకుడు సృజన్ ఒక ప్రకటనలో తెలిపారు. రాడికల్ బ్యానర్‌పై ఈ చిత్రం నిర్మిస్తుండగా, 2022 నవంబర్‌లో శాలిహుండం కొండపై వేణుగోపాల స్వామి ఆలయం వద్ద షూటింగ్ ప్రారంభించామని, ఇందులో గీతా సైనీ, శ్రీ చరణ్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్నట్లు తెలిపారు.

కాగా 120 రోజుల పాటు మూడు షెడ్యూల్స్‌లో శ్రీకాకుళం పట్టణంతో పాటు గార, నరసన్నపేట, పోలాకి, జలుమూరు మండలాల్లో పలు చోట్ల చిత్రీకరణ చేసినట్లు పేర్కొన్నారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు



క్రీడాకారులకు కిట్‌లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్

ఆమదాలవలస: జగనన్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా.. వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ ఆధ్వర్యంలో ఆమదాలవలస మున్సిపాలిటీ రావికంటిపేట గ్రామంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. రవికుమార్ మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులంతా ఈ పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. క్రీడాకారులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించామన్నారు. మొత్తం 16 జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. విజేతకు రూ.50వేలు, రెండో బహుమతి రూ.40వేలు, మూడో బహుమతి రూ.30వేలు, నాల్గో బహుమతి కింద రూ.20వేలు ప్రదానం చేస్తామన్నారు. పోటీలను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు సుందరరావు మాస్టారు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రెసిడెంట్ రమణ, రిఫరీ బోర్డు చైర్మన్ తిరుపతి రావు మాస్టారు, కబడ్డీ బోర్డు చైర్మన్ శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'ఆ వీడియోలో ఉన్నది కొత్తూరు కాదు'

శ్రీకాకుళం క్రైమ్ : కొత్తూరు ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు గంజాయి కలిపిన చాక్లెట్లు రూ. 20 లకు అమ్ముతున్నారంటూ ఓ ప్రైవేటు ఛానెల్ వీడియో ప్రసారం చేసిందని, కానీ వాస్తవానికి అది మన కొత్తూరు మండలానికి సంబంధించినది కాదని స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో (సెబ్) అదనపు ఎస్పీ విజయనాగమణికంఠ గురువారం తెలిపారు. తెలంగాణలోని వీడియోలో పేర్కొన్నది శంషాబాద్ పరిధిలో ఉన్న కొత్తూరు ప్రభుత్వ పాఠశాలకు సంబంధించినదని, మన కొత్తూరు కాదని స్పష్టం చేశారు.

గార ఎస్‌బీఐ కేసులో కొందరి పాత్రపై పోలీసుల ఆరా

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో సంచలనం కలిగించిన గార ఎస్‌బీఐ బంగారం మాయం కేసుకు సంబంధించి కొందరి అనుమానితుల పాత్రపై పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. గార ఎస్‌బీఐ బ్రాంచిలో ఆ మధ్య కాలంలో పనిచేసిన ఓ ఉద్యోగిని పోలీసులు రెండు రోజులుగా విచారిస్తున్నారు. సీసీ పుటేజీలో ఆ ఉద్యోగి కూడా ఉండటంతో ఆయనపై అనుమానం వచ్చి పోలీసులు పిలిపించారు. నిజానిజాలు నిరూపితమైతే అరెస్టు చేయడానికి పోలీసులు సిద్ధంగా ఉన్నట్లు భోగట్టా.

జాతీయ స్థాయి సాఫ్ట్‌టెన్నిస్‌కు తేజ ఎంపిక



గురాడి తేజ

పాతపట్నం: మధ్యప్రదేశ్ రాష్ట్రం దేవాస్‌లో ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు జరగనున్న జాతీయ స్థాయి సాఫ్ట్‌టెన్నిస్ టోర్నమెంట్‌కు పాతపట్నం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల విద్యార్థి గురాడి తేజ ఎంపికైనట్లు సాఫ్ట్‌టెన్నిస్ జిల్లా సంఘం అధ్యక్షుడు జి.అప్పన్న గురువారం తెలిపారు. గత నెల 16,17 తేదీల్లో గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. తేజను సంఘం సెక్రటరీ షణ్ముఖరావు, ఉపాధ్యక్షుడు పనుకు మోహన్, ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్,వైస్ ప్రిన్సిపాల్‌లు కే.శ్రీరాములు, చక్రపతి, పీడీలు, పీఈటీలు అభినందించారు.

ఆనందంగా ఆత్మీయ కలయిక



ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఆమదాలవలస: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1984 నుంచి ఇప్పటివరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు గురువారం ఆత్మీయంగా మళ్లీ కలిశారు. తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సందడిగా గడిపారు. ప్రస్తుతం కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న డాక్టర్ ఎస్ఎస్ఎన్ స్వామిని పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు బుడుమూరు శ్రీనివాసరావు తదితరులు సత్కరించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.